## కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

మళ్లీ కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారు. రజతోత్సవ మహా సభ నిర్వహణకు ఎప్పటికప్పుడు కేసీఆర్, కేటీఆర్‌లు దిశానిర్దేశం చేస్తున్నారు. 1200 ఎకరాల భూమిని సభ కోసం రైతులను మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఒప్పించారు. పార్కింగ్ స్థలం వద్ద రైతు మొగిలి తన పంట పూర్తికాకున్నా 20 గుంటల భూమిని సాఫ్ చేసుకొంటానని ముందుకు వచ్చారు. రైతులు, పార్టీ శ్రేణులు సభ కోసం ఎదురుచూస్తున్నారు. వేలాది వాహనాల్లో లక్షలాది మంది సభకు రానున్నారు. ట్రాఫిక్‌కు ఎక్కడా అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలపై ఉంది.



హనుమకొండలో మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన తక్కళ్లపల్లి, పోచంపల్లి, దాస్యం, నన్నపునేని, వొడితల, రాజయ్య పెద్ది

# ఇక్కడి ప్రజల చైతన్యం గొప్పది

- తెలంగాణ ఉద్యమంలో వరంగల్ ముఖ్య భూమిక
- చరిత్రాత్మకంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి

హనుమకొండ, ఏప్రిల్ 11: 'తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్వహించిన అన్ని సభలు, సమావేశాలు విజయవంతమయ్యాయి. ఇందులో వరంగల్, కరీంనగర్ జిల్లాలు ముఖ్య భూమిక పోషించాయి. వరంగల్‌లో జరిగిన సింహగర్జన సభను మాజీ ప్రధాని దేవ గౌడ చూసి.. తాను చాలా సభలు చూశానని, కానీ ఇలాంటిది ఎప్పుడూ చూడలేదన్నారు. ఇక్కడి ప్రజల చైతన్యం గొప్పది' అని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి రజతోత్సవ సభ ఏర్పాట్లపై ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ మహాసభ చరిత్రాత్మకమని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ స్థాపించిన తొలినాళ్లలో పట్టుమని 10 సీట్లు కూడా గెలువదని అవహేళన చేశారని, ఈ సందర్భంలో కేసీఆర్ చావడమో.. తెలంగాణ రావడమో అని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేళ్ల పాలనలో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చూపించిన పాలనా దక్షుడు కేసీఆర్ అన్నారు. రజతోత్సవ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పాదయాత్రలో ప్రజలు రానున్నారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, వొడితల సతీశ్ బాబు, మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, నాయకులు సాంబారి సమ్మారావు, సదానందం, యాదగిరి, పులి రజినీకాంత్, ఎల్లావుల లలితా యాదవ్, రాకేశ్‌రెడ్డి, శోభన్‌కుమార్, వీరేందర్, జోరిక రమేశ్, రామ్మూర్తి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### 25 ఏండ్ల నవ యవ్వన పార్టీ బీఆర్‌ఎస్

**హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్**

25 ఏండ్ల నవ యవ్వన పార్టీ బీఆర్‌ఎస్. త్యాగాల పునాదులపై కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను స్థాపించాడు. సకల జనులను ఒక్కతాటిపై తెచ్చి తెలంగాణ సాధించాడు. పదేండ్లలో ప్రజలు మెచ్చిన పాలన చేశాడు. దేశంలోనే రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపాడు. నిలిపారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను నిర్వహిస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌బాబు, రైతులు స్వచ్ఛందంగా సభ నిర్వహణ కోసం భూములు ఇచ్చినందుకు ధన్యవాదాలు. సభకు తరలివచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

**బేజార్‌మేళా**



హోటల్ ఆవరణలో కిక్కిరిసిన నిరుద్యోగ యువతీ, యువకులు



గాయపడిన యువతికి ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

# ఏర్పాట్లు ఇలాగేనా?

- గందరగోళంగా వరంగల్ జాబ్‌మేళా
- తొక్కిసలాటలో ముగ్గురు యువతులకు గాయాలు
- అంచనా వేయడం, ఏర్పాట్లలో అధికారులు విఫలం
- కనీస వసతులు లేక ఎండ వేడిమికి విలవిల్లాడిన నిరుద్యోగులు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 11 : టాస్క్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాబ్‌మేళా గందరగోళంగా మారింది. ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తోపులాటకు దారితీసింది. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ జంక్షన్‌లోని ఎంకే నాయుడు హోటల్స్ అండ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరైంది. సుమారు 6వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రచారం చేయడంతో యువత ఎక్కువ సంఖ్యలో హాజరుకాగా, హోటల్ ఆవరణ కిక్కిరిసిపోయింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆలస్యంగా రావడం, కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగాలు పూర్తయ్యే వరకు నిరుద్యోగులను లోనికి అనుమతించకపోవడంతో హోటల్ ఆవరణ పూర్తిగా నిండిపోయింది. మంత్రులు తమ ప్రసంగాన్ని ముగించుకొని వెళ్లిపోయాక నిరుద్యోగులను లోనికి అనుమతించడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో హోటల్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన భారీ అద్దాలు పగిలిపోయి ముగ్గురు యువతులకు గాయాలయ్యాయి. దీంతో నిరుద్యోగులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. పోలీసులు వారిని నిలువరించి గాయాలపాలైన యువతులను స్థానిక హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు.

**ఏర్పాట్లలో అధికారులు విఫలం**

మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేయడంలో కార్పొరేషన్ అధికారులు విఫలయ్యారు. సుమారు 60 కంపెనీలు పాల్గొంటాయని, 6వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్వయంగా మంత్రి కొండా సురేఖ ప్రచారం చేయడంతో సుమారు 10వేల మందికి పైగా హాజరయ్యారు. రిజిస్టర్ చేసుకున్న నిరుద్యోగుల సంఖ్యను చూసైనా ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. హోటల్ ఆవరణ ఇరుకుగా ఉండడం, భారీస్థాయిలో నిరుద్యోగులు హాజరు కావడం, మంత్రులు వెళ్లిపోయే వరకు వారిని లోపలికి అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకు చాలా మంది డీహైడ్రేషన్‌కు గురయ్యారు. కనీసం తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోవడంపై మండిపడ్డారు.

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రులు కొండా సురేఖ, సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన మంత్రి సీతక్క

ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ముందుకు సాగడం అలవాటు చేసుకోవాలని మంత్రులు కొండా సురేఖ, సీతక్క యువతకు సూచించారు. శనివారం టాస్క్ ఆధ్వర్యంలోని జాబ్‌మేళాను ప్రారంభించారు. ముందుగా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగాలకు ఎంపికైన 17మందికి మంత్రులు, కలెక్టర్‌తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ రానున్న రోజుల్లో దశలవారీగా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉపాధి కల్పనలో తెలంగాణను అగ్రగామిగా నిలుపుతామని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో ప్రతి జిల్లాలో జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు. త్వరలో 14వేల అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. వివిధ శాఖల్లో ఖాళీ పోస్టుల వివరాలను సేకరించామని త్వరలో వాటిని భర్తీ చేస్తామన్నారు. మామునూరు విమానాశ్రయ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. తద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టాస్క్ సీఈవో రెడ్డి, అదనపు కమిషనర్ జోనా, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్య, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.



కేసముద్రం: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సత్యవతి, శంకర్‌నాయక్

# ప్రజలు మార్పు కావాలంటున్నరు

- బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నరు
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

కేసముద్రం/నెల్లికుదురు, ఏప్రిల్ 11: ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ కావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. కేసముద్రం, నెల్లికుదురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో శుక్రవారం రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ డోర్నకల్‌లో రూ. వంద కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ప్రారంభోత్సవం చేసినా ఇంత వరకు డీపీఆర్ లేదన్నారు. కేసీఆర్‌కు ప్రజలే హైకమాండ్ అని, వారి ఆలోచన విధంగానే పరిపాలన చేశాడని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, దీంతో కేంద్రం నుంచి నిధులు రాక అభివృద్ధి కుంటుపడి పోయిందన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ఏం చెబుతాడోనని నాలుగున్నర కోట్ల ప్రజలు వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నారని సత్యవతి పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభను సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు ఓలం చంద్రమోహన్, ఎర్రబెల్లి మాధవి, రావుల శ్రీనాథ్‌రెడ్డి, మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పరుపాటి వెంకట్ రెడ్డి, నజీర్ అహ్మద్, కార్యదర్శి కముటం శ్రీని వాస్, ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీశ్‌నాయక్, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండా వెంకన్న, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బత్తిని అనిల్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బానోత్ బీముడు, నాయకులు నీలం దుర్గేశ్, మోడెం రవీందర్‌గౌడ్, సట్ల వెంకన్న, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, అన్నెపాక వెంకన్న, లింగాల పిచ్చయ్య, గందసిరి సోమన్న , తొనుపునూరి సాయి, చిర్ర యాకాంతం గౌడ్, కాసం వెంకటేశ్వర్ రెడ్డి, పులి రామచంద్రు, గొట్టిముక్కల ఆదిరెడ్డి, వీరగాని మల్లేశ్, భోజ్యానాయక్, ప్రభాకర్ రెడ్డి, కొమ్ము అనిల్, బొడ్డం చంద్రారెడ్డి, నల్లాని నవీన్ రావు, బోజ్యా నాయక్, బిక్కునాయక్, కసరబోయిన విజయ్ యాదవ్, ఎడ్ల మహేశ్, యాద రాజు ఉన్నారు.

### బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్**

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలి. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అరిగోస పడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడానికి ఐక్యంగా కృషి చేయాలి. రజతోత్సవ సభను వియజవంతం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి 10 వేల మంది తరలివెళ్లి సభను సక్సెస్ చేద్దాం.




హసన్‌పర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# కొట్లాడే చరిత్ర మనది

- రానున్న రోజులు బీఆర్‌ఎస్‌వే..
- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి సభను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి/కొడకండ్ల/తొర్రూరు, ఏప్రిల్ 11: కొట్లాడే చరిత్ర మనదని, రానున్న రోజులు బీఆర్‌ఎస్‌వేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి, కొడకండ్ల, పెద్దవంగరలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ అధికారం లేదని కార్యకర్తలు బెంగ పడొద్దని, అండగా ఉంటానన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా తయారై లక్షలాది మందితో సభకు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. మన పార్టీ బలోపేతం కోసం కేసీఆర్ చేసిన పనులే మన బలంగా నిలుస్తాయని, ప్రజలు బీఆర్‌ఎస్ సర్కార్ కావాలనే కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటుతుందని, పార్టీకి 100 సీట్లు కచ్చితంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. నిజమైన ఉద్యమకారులు బీఆర్‌ఎస్ నాయకులని, ప్రతి కార్యకర్త కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకుపోవాలన్నారు. సర్పంచ్, ఎంపీటీలను గెలిపించుకునే బాధ్యతను తానే తీసుకుంటానని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేని విషయమై గ్రామాల్లో చర్చలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రామ్మూర్తి, 1, 66 డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరెడ్ల శ్రీధర్, ఆత్మ మాజీ చైర్మన్ చంద్రమోహన్, గండు అశోక్, మాజీ సర్పంచ్‌లు, శరత్, రాణీ రాజు, సాంబారెడ్డి, బీఆర్‌ఎస్వీ నాయకులు రాజేందర్, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు పంజాల కుమార్, రాజు, రంజిత్, జన్ను కిషన్, ఐలయ్య, సారయ్య, రంజిత్, బీఆర్‌ఎస్ హసన్‌పర్తి, కొడకండ్ల మండల అధ్యక్షులు బండి రజినీకుమార్, సిందే రామోజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ పేరం రాము, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎండలో మాడుతున్న వాహనదారులు

# భగ భగ

- ఎండ వేడికి జనం విలవిల
- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద మాడిపోతున్న వాహనదారులు
- సన్ షేడ్ గ్రీన్ నెట్ ఏర్పాటుపై దృష్టి సారించని బల్దియా

వరంగల్, ఏప్రిల్ 11 : భానుడి భగభగతో జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మొన్నటివరకు సాధారణ పరిస్థితి ఉండగా శుక్రవారం పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరింది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండడంతో రహదారులపై వెళ్లే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఎండ నుంచి ఉపశమనం కోసం బల్దియా రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో నగరవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రేటర్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసినా అవి నామమాత్రంగా ఉన్నాయి. చాలాచోట్ల నీళ్లు పోసేందుకు మనుషులను నియమించలేదు. తడకల షెడ్ వేసి, బ్యానర్ మాత్రం కట్టారు. దాహం తీర్చే చలివేంద్రాలు కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా నగరంలో వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.




రత్న హోటల్ సెంటర్‌లో నీళ్లు లేకుండా చలివేంద్రం షెడ్డు వేసి వదిలిన బల్దియా అధికారులు

### సిగ్నల్స్ వద్ద గ్రీన్ షేడ్ నెట్ లేవీ?

ఎండాకాలం వచ్చిందంటే ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులకు అగ్ని పరీక్ష తప్పడం లేదు. వేడి నుంచి ఉపశమనం కోసం నగరంలోని సిగ్నల్ పాయింట్స్ వద్ద సన్ షేడ్ గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాల్సిన బల్దియా అధికారులు అలాంటి ఏర్పాట్లేవీ చేయడం లేదు. దీని వల్ల మిట్ట మధ్యాహ్నం ఎండకు మాడిపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ పాయింట్ల వద్ద 60 నుంచి 120 సెకన్ల వరకు ఆగాల్సి వస్తోందని ఆ సమయంలో చల్లదనం కోసం నెట్ వేయాలని ఎండ వేడి నుంచి తప్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు ప్రధాన నగరాల్లో గ్రీన్ నెట్ ఏర్పాటు చేయగా వరంగల్‌లో కూడా గతంలో వలె ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద గ్రీన్ నెట్లు అమర్చే విషయమై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

### వడదెబ్బతో తాపీమేస్త్రి మృతి



మల్లేశం (ఫైల్)

దామెర, ఏప్రిల్ 11 : ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై ఓ తాపీమేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. హనుమకొండ పోచమ్మకుంట సగరవీధికి చెందిన వేముల మల్లేశం(46) దామెరకు చెందిన గిద్దెలూరి కొమురు భవన నిర్మాణ పనుల కోసం గురువారం వెళ్లాడు. భవనంపై పని చేస్తుండగా వడదెబ్బ తగలడంతో స్థానికులు వరంగల్‌లోని ఓ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లేశం భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

**మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 11 : స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ దేశానికే గొప్ప ఆదర్శ పాలన అందించి ప్రజల మన్ననలు పొందారని తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కొనియాడారు. శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి ఎల్కతుర్తిలో రజతోత్సవ సభా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక నేతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ వరంగల్ అంటే పెద్దసభలకు పెట్టింది పేరన్నారు. జిల్లా నాయకులతో 1200 ఎకరాల్లో సభ నిర్వహించడం హర్షణీయమని, ఇందులో వాహనాల పార్కింగ్ కూడా భారీగా స్థలాలు కేటాయించారని తెలిపారు. సభకు సుమారు 10 లక్షల జనం వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కేసీఆర్ ఆలోచన నభూతో నా భవిష్యత్ అని, తెలంగాణలో ఎప్పుడూ ఇలాంటి సభ జరగలేదనే రీతిలో సభ ఉంటుందని తెలిపారు. కేసీఆర్ సంతృప్తికర పాలనను అందించి చెరువుల మరమ్మతు, మిషన్ భగీరథ, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, 24గంటల కరంటు, పార్టీలకతీతంగా కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మాయి పుడితే 13వేలు, ఆసరా పింఛన్ల పెంపు ఇలా దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. కేసీఆర్ ఎలక్షన్ల వరకే రాజకీయాలు చేసేవారని, తర్వాత పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ప్రజలంతా కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని, ఈ సభ ద్వారా కేసీఆర్ ఏం చెప్తారని ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. ప్రజలు ఈ సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వాహనాల కొరత ఉన్నప్పటికీ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ప్రజలు పాదయాత్ర, ఎడ్లబండ్ల ద్వారా వచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ధర్మసాగర్ మండల ఇన్‌చార్జి కర్ర సోమిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సభాస్థలి వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత రాకేశ్‌రెడ్డితో కలిసి మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య


**చరిత్రను తిరగరాసే సభ : ఏనుగుల రాకేశ్‌రెడ్డి**

ఎల్కతుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభ చరిత్రను తిరగరాసే సభగా నిలిచిపోతుంది. పదేండ్ల కేసీఆర్ పాలన తెలిసిన ప్రజలు ఇప్పుడు 16 నెలల పాలనను చూసి మళ్లీ ఆయనే రావాలని కోరుకుంటున్నారు. కనీవినీ ఎరగని రీతిలో ఈ సభ జరుగుతుంది. సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చినట్లు పండుగలా జనం వస్తారు. సభను ఎవరూ అడ్డుకోలేరు. పార్టీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి సభను విజయవంతం చేయాలి.

# పదేండ్ల పాలనలో రాష్ట్రం నంబర్‌వన్

- రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 11: కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు మండలంలోని నవాబుపేట, ఏలేటిరామయ్యపల్లి, చింతకుంటరామయ్యపల్లి, కైలాపూర్, తిరుమలాపూర్, గుంటూరుపల్లి, చిట్యాల గ్రామాల్లోని కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించి సకల జనులను చైతన్యం చేసి చావు దాకా వెళ్లి స్వరాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పదేండ్ల పాలనలో తాగు, సాగు నీరు, రోడ్లు, తండాలను గ్రామ పంచాయతీలు చేయడం, ప్రజలు అడగని ఎన్నో పథకాలను తీసుకొచ్చి తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నవాబుపేట శివారులో రైతుల శ్రేయస్సు కోసం నిర్మించిన చెక్ డ్యామును ఈ ప్రాంత ఎమ్మెల్యే నాటు బాంబులతో పేల్చి కూలగొడుతున్నారని ఆరోపించారు. రజతోత్సవ సభకు చిట్యాల మండలం నుంచి పెద్ద మొత్తంలో హాజరు కావాలని కోరారు. నవాబుపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువకులు కలికోట రాజపోషయ్య, పర్లపెల్లి సు మంత్, కలికోట కార్తీక్, సంపంగి రాజకుమార్, ఓర్సు శ్రీకాంత్, కలికోట వాసు, మట్టెవాడ రాజు, పర్లపెల్లి అరుణ్‌కుమార్ గండ్ర సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్, నాయకులు మడికొండ రవీందర్‌రావు, ఎరుకొండ రాజేందర్ గౌడ్, కాట్రేవుల కుమార్, పెరుమాండ్ల రవీందర్, ఆయా గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నవాబుపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



నర్సంపేట : సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

# భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే

- రజతోత్సవ సంబురాలు అంబరాన్నంటాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఏప్రిల్11: కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగమని, రాష్ట్ర ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సంపేటలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ విజయవంతానికి ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్ది హాజరై మాట్లాడారు. భవిష్యత్తు బీఆర్‌ఎస్ పార్టీదేనని అన్నారు. రజతోత్సవ మహా సభ సంబురాలు అంబరాన్నంటాలని పిలుపునిచ్చారు. ఉద్యమ పార్టీకి 25 ఏళ్లు పూర్తయ్యాయని చెప్పారు. ప్రపంచ చరిత్రలో నిలిచిపోయే సభలు నిర్వహించిన సత్తా బీఆర్‌ఎస్ పార్టీదేనని ఆయన గుర్తు చేశారు. మండలాలు, గ్రామాల్లో చర్చ పెట్టాలని, కేసీఆర్‌ను చూడాలని, సభకు రావాలని కార్యకర్తలు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంతోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. డివిజన్ నుంచి 25వేల మంది కార్యకర్తలకు ఒక్కరు తక్కువ కాకుండా వచ్చి నర్సంపేట పోరాట పటిమను, సత్తా చాటాలని పెద్ది కోరారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండాను ఎగురవేయాలన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తున్నదని, ప్రజలకు అండగా కేసీఆర్ ఉన్నారని చెప్పారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నర్సంపేట పట్టణ, మండల అధ్యక్షులు నాగెళ్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్యనారాయణ, నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బానోత్ సారంగపాణి, వేములపల్లి ప్రకాశ్ రావు, బాల్నే వెంకన్న, ఊడ్గుల ప్రవీణ్, రాజేశ్వర్ రావు, గోనె యువరాజ్, మండల శ్రీనివాస్, బండి రమేశ్, సదానందం, నాగిశెట్టి ప్రసాద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.